సాక్షి

భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం । 11 । అక్టోబర్ । 2023



మిరపకు తెగులు..

ఇప్పడిప్పడే పూత, కాతకు వస్తున్న మిర్చివంటకు తెగుళ్లతో రైతులు దిగులు చెందుతున్నారు. ఎన్ని మందులు వేసినా ఫలితం లేదంటున్నారు. 10లో



తనిఖీల్లో నగదు స్వాధీనం

ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యాన పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేయగా జిల్లాలో మూడు చోట్ల నగదు పట్టుబడింది. 10లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 34° / 23°

జిల్లాలో బుధవారం అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. మధ్యాహ్నం సమయంలో ఎండ ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేత్రపర్వం.. రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి నిత్య కల్యాణ వేడుక మంగళవారం నేత్ర పర్వంగా సాగింది. తెల్లవారు జామున గర్భగుడిలో సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన, తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారిని బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం నిర్వహించారు. అనంతరం స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్య కల్యాణ వేడుకను శాస్త్రోక్తంగా జరిపించారు. మంగళవారాన్ని పురస్కరించుకొని అంజనేయస్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేటి నుంచి సింగరేణి రైలు పునఃప్రారంభం

కొత్తగూడెంఅర్బన్: భద్రాచలం రోడ్(కొత్తగూడెం) రైల్వేస్టేషన్ నుంచి సింగరేణి ఎక్స్‌ప్రెస్ రైలు బుధవారం ప్రారంభం కానుందని అధికారులు తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో రైలు తాత్కాలికంగా రద్దు చేయగా, ఆ తర్వాత పొడిగిస్తూ వచ్చారు. ఎట్టకేలకు బుధవారం నుంచి రైలు మొదలవుతుందని అధికారులు వెల్లడించగా స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా, సిర్పూర్‌కాగజ్‌నగర్ నుంచి ప్రారంభమయ్యే ఈ రైలు మంగళవారం రాత్రి కొత్తగూడెం స్టేషన్‌కు చేరుకుని ఉదయం తిరిగి బయలుదేరుతుంది.

రేపు కేంద్ర మంత్రి బీఎల్ వర్మ రాక

ఇల్లెందు/చుంచుపల్లి: ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి శాఖ మంత్రి బీఎల్ వర్మ గురువారం ఇల్లెందుకు రానున్నట్లు బీజేపీ జిల్లా కన్వీనర్ నాళ్ల సోమసుందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇల్లెందులో బీజేపీ కార్యాలయం ప్రారంభోత్సవం, అంతకుముందు సువర్చలా సహిత ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తారని పేర్కొన్నారు. అనంతరం గిరిజన సమ్మేళనంలో పాల్గొన్నాక మణుగూరు వెళ్తారని వివరించారు.

కార్మిక సంఘాలకు గుర్తుల కేటాయింపు



యూనియన్ నాయకులతో మాట్లాడుతున్న డీవైసీఎల్సీ

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు ఈనెల 28న నిర్వహించేందుకు డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ (డీవైసీఎల్సీ), ఎన్నికల రిటర్నింగ్ అధికారి దేవరకొండ శ్రీనివాసులు మంగళవారం వివిధ కార్మిక సంఘాలకు గుర్తులు కేటాయించారు. ఎన్నికల వాయిదా కోరుతూ సింగరేణి యాజమాన్యం హైకోర్టు బెంచ్‌ను ఆశ్రయించిన నేపథ్యంలో బుధవారం తీర్పు వెలువడనుంది. అయితే గుర్తింపు సంఘం నామినేషన్ల స్క్రూటినీ ముగిసినందున పలు కార్మిక సంఘాల నాయకులతో చర్చలు జరిపిన శ్రీనివాసులు గుర్తులు కేటాయించారు. రహస్య బ్యాలెట్ ఎన్నికల్లో పాల్గొనడానికి సమ్మతించిన 15 రిజిస్టర్డ్ సంఘాలలో 14 సంఘాలు షెడ్యూల్ ప్రకారం ఈనెల 6, 7 తేదీల్లో నామినేషన్లు దాఖలు చేశాయని, ఎన్నికల బరిలో నిలిచేందుకు 13 సంఘాలు అర్హత సాధించాయని శ్రీనివాసులు తెలిపారు. ఒక సంఘానికి 2020 జనవరి 01 నాటికి ఏడాది పూర్తికానందున అర్హత పొందలేదన్నారు.

విద్యార్థుల వివరాలు నమోదు చేయాలి

పాల్వంచ: ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు చదివే విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని డీఈఓ వెంకటేశ్వరాచారి ఆదేశించారు. పాత పాల్వంచలోని ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంలతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల వివరాలను యూడైస్ ప్లస్‌లో అనుసంధానం చేయనున్నందున ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. ప్రతీరోజు విద్యార్థుల హాజరును ఎఫ్ఆర్ఎస్ సిస్టం యాప్‌లో పొందుపర్చాలని చెప్పారు. జిల్లా గణాంక అధికారి సతీశ్‌కుమార్, ఎంఈఓ శ్రీరామ్మూర్తి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

తేలని పొత్తులు

కామ్రేడ్లతో కాంగ్రెస్ సర్దుబాటుపై సందిగ్ధం

- 'కారు' బాటలోనే హస్తం నేతలు
- పొత్తులపై మొదలైన మాటల మంటలు
- కొత్తగూడెం సీటు వదులుకునేందుకు ససేమిరా



సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీలతో కాంగ్రెస్ పొత్తు ఒకడుగు ముందుకు.. రెండడుగులు వెనక్కు అన్నట్టుగా మారింది. ఎన్నికల కదన రంగంలో కలిసి నడుస్తామని ఆయా పార్టీల అగ్రనాయకులు చెబుతుంటే క్షేత్రస్థాయిలో అందుకు భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి.

సీట్లపైనే పేచీ

ఈ ఏడాది ఆరంభంలో కమ్యూనిస్టులు కాంగ్రెస్‌తో అంటీముంటనట్టుగా వ్యవహరించారు. భారతీయ జనతా పార్టీకి దీటుగా బదులిస్తున్న భారత రాష్ట్ర సమితితోనే ఎన్నికల్లో కలిసి నడుస్తామని నేరుగా ఆ పార్టీ అగ్రనేతలు ప్రకటిస్తూ వచ్చారు. అయితే ఇటు సీపీఐ, అటు సీపీఎం ఉమ్మడి ఖమ్మం, నల్గొండ జిల్లాలోని కీలక సీట్ల కోసం పట్టుబట్టాయి. ముఖ్యంగా కొత్తగూడెం, వైరా సీట్లను సీపీఐ.. పాలేరు, భద్రాచలం సీట్లను సీపీఎం కోరాయి. ఈ అంశంపై నాలుగైదు దఫాలుగా ఇరు పార్టీల నేతల మధ్య చర్చలు జరిగినా ఇరు వర్గాల మధ్య సయోధ్య కుదరలేదు. దీంతో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఏకపక్షంగా దాదాపు అన్ని స్థానాలకూ అభ్యర్థులను ప్రకటించారు. దీంతో కమ్యూనిస్టులతో పొత్తు ప్రస్తావన అనేది లేకుండా పోయింది.

కాంగ్రెస్‌తో కలిసి..

ఎన్నికల పొత్తుపై మాట వరుసకైనా చెప్పకుండా బీఆర్ఎస్ అభ్యర్థులను ప్రకటించడం కమ్యూనిస్టు పార్టీలకు మింగుడు పడలేదు. దీంతో అనివార్యంగా కాంగ్రెస్‌కు స్నేహ హస్తం అందించాయి. ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్‌తో కమ్యూనిస్టు నేతలు ఇప్పటికే పలుమార్లు సంప్రదింపులు జరిపారు. పై స్థాయిలో చర్చలు జరుగుతుండటంతో పార్టీ హై కమాండ్ నిర్ణయానికి కట్టుబడి ఉంటామని స్థానిక హస్తం నేతలు ప్రకటించారు. అయితే పొత్తులపై ఎంతకీ స్పష్టత రావడం లేదు. మరోవైపు రోజులు గడుస్తున్న కొద్దీ ఆశావహులు సైతం తమ వంతు ప్రయత్నంగా టికెట్ల కోసం తీవ్రంగా శ్రమిస్తున్నారు. ముఖ్యంగా జిల్లాలో ఏకైక జనరల్ స్థానంగా ఉన్న కొత్తగూడెం నుంచి హస్తం పార్టీ తరఫున పోటీ ఎక్కువగా ఉంది.

హస్తం ఉండాల్సిందే

కొత్తగూడెం సీటును కమ్యూనిస్టులకు కేటాయించారంటూ జోరుగా ప్రచారం జరగడం కాంగ్రెస్ నేతలను కలవరపాటుకు గురి చేస్తోంది. దీంతో ఎవరికి వారు తమ గాడ్‌ఫాదర్లకు ఫోన్లు చేసి పొత్తుల చిక్కులపై వాకబు చేస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ తమకు పొత్తు కారణంగా అన్యాయం జరగకుండా చూడాలంటూ విన్నవించుకున్నారు. పొత్తు విషయంలో ముందుగానే ఓ స్పష్టత ఇస్తే బాగుండేదని, ఎంతకీ తేల్చక పోవడం వల్ల తాము ఈ సీటుపై నమ్మకం పెట్టుకుని పని చేస్తున్నామని టికెట్ ఆశిస్తున్న నేతలు అంటున్నారు. ఇదే సమయంలో పార్టీ హైకమాండ్‌కు ఎదురు సమాధానం చెబితే అసలుకే ఎసరు వస్తుందనే భయం కూడా లేకపోలేదు. దీంతో నేరుగా నేతలు బటయకు రాకుండా తమ అనుచరులు, మద్దతుదారులతో ప్రెస్‌మీట్లు పెట్టిస్తున్నారు. కొత్తగూడెం నుంచి కాంగ్రెస్ పార్టీనే బరిలో ఉంటుందంటూ ప్రకటనలు ఇప్పిస్తున్నారు. ఇప్పటికే ఎన్నికల షెడ్యూల్ ఖరారైన నేపథ్యంలో రాబోయే రోజుల్లో మరింత దూకుడుగా ఉండాలని కాంగ్రెస్ నేతలు నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం.

కొత్తగూడెంపై పట్టు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు కొత్తగూడెం నుంచి ఎలాగైనా పోటీ చేయాలనే పట్టుదలతో ఉన్నారు. దీంతో జాతీయ స్థాయిలో పార్టీ పరంగా మంతనాలు సాగిస్తున్నారు. కొత్తగూడెంలో సీపీఐకి గతంలో ఎన్నడూ లేనంత అనుకూల పరిస్థితులు ప్రస్తుతం ఉన్నాయంటూ పార్టీ పెద్దలకు వివరిస్తున్నారు. కాంగ్రెస్‌తో ఎన్నికల అవగాహన ఉంటే కొత్తగూడెం నుంచి సీపీఐ బరిలో ఉండాల్సిందేనని ఖరాఖండీగా చెబుతున్నారు. దీంతో కూనంనేని పట్టుదల కాంగ్రెస్ నేతల్లో కలవరపాటు కలిగిస్తోంది.

టికెట్‌పై ఆశతో..

కొత్తగూడెం సీటు నుంచి కాంగ్రెస్ తరఫున పొంగులేటి శ్రీనివాసరెడ్డి పోటీ చేస్తారని ప్రచారం జోరుగా సాగుతోంది. అయితే తాను పోటీ చేయబోయే స్థానాన్ని పార్టీ పెద్దలు నిర్ణయిస్తారంటూ పొంగులేటి ఇప్పటికే పలుమార్లు ప్రకటించారు. ఇదే స్థానం నుంచి పోటీ చేసేందుకు బీసీ వర్గాల నుంచి ఎడవల్లి కృష్ణ, నాగ సీతారాములు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. కృష్ణ ఏడాది కాలంగా క్షేత్రస్థాయిలో పని చేసుకుంటూ పోతున్నారు. మరోవైపు నాగ సీతారాములు సైతం గడపగడపకూ తిరుగుతూనే ఢిల్లీ–కొత్తగూడెం మధ్య చక్కర్లు కొడుతున్నారు. ఇలా నేతలంతా పోటీ కోసం రాత్రీ పగలు తేడా లేకుండా శ్రమిస్తున్నారు.

ఎన్నికలకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న ప్రియాంక ఆల, పక్కన ఎస్పీ, ఐటీడీఏ పీఓ తదితరులు

జిల్లా ఎన్నికల అధికారి ప్రియాంక ఆల

సూపర్‌బజార్(కొత్తగూడెం): నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించడానికి అధికారులు సిద్ధం కావాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. విధులు కేటాయించిన సిబ్బంది ఎన్నికల నిర్వహణ పట్ల అవగాహన కలిగి ఉండాలని, ఎన్నికల నియమావళి అమల్లో ఉన్నందున పటిష్ట పర్యవేక్షణ జరగాలని అన్నారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించి 1950, సీ – విజిల్ యాప్‌నకు వచ్చిన ఫిర్యాదులను తక్షణమే విచారించి పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. పోలింగ్ కేంద్రాల వారీగా రూట్ మ్యాప్‌లు, సమస్యాత్మక ప్రాంతాలకు మ్యాపింగ్ చేయాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే ఎన్నికల సంఘ నియమావళి ప్రకారం కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. ఎస్పీ డాక్టర్ వినీత్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఏదైనా సమస్య వస్తే సమీప పోలీస్‌స్టేషన్లో సమాచారం అందించాలని కోరారు. లైసెన్స్‌డ్ పిస్టళ్లను పోలీస్ శాఖకు సరెండర్ చేయాలని, లేదంటే రద్దుచేస్తామని అన్నారు. రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు లౌడ్ స్పీకర్లకు అనుమతిలేదని చెప్పారు. నగదుతో రవాణా చేసే వారు తగిన ఆధారాలు చూపించకుంటే సీజ్ చేస్తామని తెలిపారు. ఆ నగదు విడుదలకు ముగ్గురు సభ్యులతో కమిటీ ఉంటుందని, పరిశీలన తర్వాత విడుదల చేస్తామని చెప్పారు. ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాలలో వచ్చే వార్తలపై పర్యవేక్షణ ఉంటుందని, తప్పుడు సమాచారంతో పోస్టు చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. సమావేశంలో ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్, డీఎఫ్ఓ కిష్టగౌడ్, అదనపు కలెక్టర్లు రాంబాబు, మధుసూదన్‌రాజు, డీఆర్ఓ రవీంద్రనాథ్, భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్ తదితరులు పాల్గొన్నారు.

నోడల్ అధికారుల నియామకం

అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు నోడల్ అధికారులను నియమించినట్లు ప్రియాంక ఆల తెలిపారు. జిల్లాలో ఎన్నికల కోడ్ ఉన్నందున నోడల్ అధికారులు నిరంతర పర్యవేక్షణ చేయాలన్నారు. మ్యాన్‌పవర్ మేనేజ్‌మెంట్‌కు నోడల్ అధికారులు(ఎన్ఓ)గా డీఈఓ వెంకటాచారి, ఇరిగేషన్ డిప్యూటీ ఎస్ఈ కె. మహేశ్వరరావు, కోఆర్డినేటర్‌గా మైనార్టీ సంక్షేమాధికారి కె.సంజీవరావు వ్యవహరిస్తారని తెలిపారు. ట్రైనింగ్ మేనేజ్‌మెంట్ ఎన్ఓగా సీపీఓ శ్రీనివాసరావు, కోఆర్డినేటింగ్, మాస్టర్ ట్రైనర్లుగా డీఈఓ కార్యాలయ ఏపీఓ కిరణ్‌కుమార్, పి సాయికృష్ణ వ్యవహరిస్తారని, మెటీరియల్ మేనేజ్‌మెంట్ ఎన్ఓగా భూగర్భ జల శాఖాధికారి ఎం.బాలు కోఆర్డినేటింగ్ అధికారిగా డీపీఓ అభిమన్యుడు ఉంటారని తెలిపారు. ట్రాన్స్‌పోర్ట్ మేనేజ్‌మెంట్‌కు ఎన్ఓగా ఎంవీఐ జైపాల్‌రెడ్డి, కో ఆర్డినేటర్లుగా ఆర్‌టీఓ పి.వేణు, కొత్తగూడెం, మణుగూరు, భద్రాచలం డీఎంలు వ్యవహరిస్తారు. కంప్యూటరైజేషన్, సైబర్ సెక్యూరిటీకి ఎన్ఓగా డీఐసీహెచ్ సంపత్, స్వీప్ ఎన్ఓగా సివిల్ సప్లై డీఎం త్రినాథ్‌బాబు, కో ఆర్డినేటర్‌గా డీఆర్డీఓ మధుసూదన్‌రాజు ఉంటారు. ఈవీఎం మేనేజ్‌మెంట్ ఎన్ఓగా అదనపు కలెక్టర్ పి.రాంబాబు వ్యవహరిస్తారు. ఎంసీసీ ఎన్ఓగా జెడ్పీ డిప్యూటీ సీఈఓ నాగలక్ష్మి, కో ఆర్డినేటర్లుగా సీఈఓ విద్యాలత, డీఎల్‌పీఓ పవన్ ఉంటారని కలెక్టర్ వివరించారు.

కొత్తగూడెం ఎమ్మెల్యే అనర్హతపై స్టే కొనసాగింపు

తదుపరి విచారణ ఈనెల 31కి వాయిదా

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావుపై నమోదైన అనర్హత పిటిషన్‌ను మంగళవారం విచారించిన సుప్రీంకోర్టు ఈనెల 31కి కేసు వాయిదా వేసినట్లు న్యాయవాది లక్కినేని సత్యనారాయణ తెలిపారు. వనమా ఎన్నికల అఫిడవిట్‌లో తప్పుడు సమాచారం ఇచ్చారని ఆయన ప్రత్యర్థి జలగం వెంకటరావు కోర్టులో కేసు వేసిన విషయం తెలిసిందే. దీనిపై హైకోర్టు వనమా ఎన్నిక చెల్లదని తీర్పు ఇవ్వగా, ఎమ్మెల్యే సుప్రీంకోర్టుకు వెళ్లడంతో వాదనలు కొనసాగతున్నాయి. ఈ క్రమంలో ఈ నెల 31 వరకు విచారణను వాయిదా వేసినట్లు న్యాయవాది లక్కినేని తెలిపారు. అప్పటివరకు గతంలో ఇచ్చిన స్టే కొనసాగుతుందని కోర్టు తెలిపిందని ఆయన పేర్కొన్నారు.

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

మహబూబాబాద్ ఎంపీ కవిత

పినపాక: కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి వచ్చే ఎన్నికల్లో రేగా కాంతారావు గెలుపునకు కృషి చేయాలని మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత సూచించారు. మండలంలోని ఈ – బయ్యారం క్రాస్ రోడ్డులో మంగళవారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆమె ఎమ్మెల్యే రేగా కాంతారావుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ నియోజకవర్గంలో రూ.400 కోట్ల నిధులు మంజూరు చేయించి అభివృద్ధి చేసిన కాంతారావును మరోమారు గెలిపించేలా ఇప్పటి నుంచే ప్రచారం చేపట్టాలని సూచించారు. వంద మంది ఓటర్లకు ఒక కార్యకర్త ఇన్‌చార్జ్‌గా ఉంటూ ప్రభుత్వ పథకాలను వివరించాలని తెలిపారు. అనంతరం కాంతారావు మాట్లాడగా ఎంపీపీ గుమ్మడి గాంధీ, ఆత్మ, సొసైటీ చైర్మన్లు భద్రయ్య, రవిశేఖర్‌వర్మ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పగడాల సతీష్‌రెడ్డితో పాటు కంది సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ కవిత

లారీ ఓనర్ల అసోసియేషన్ నాయకులతో భేటీ

మణుగూరు రూరల్: పట్టణంలోని లారీ ఓనర్ల అసోసియేషన్ బాధ్యులతోఎమ్మెల్యే రేగా కాంతారావు మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలు సమస్యలను నాయకులు విన్నవించగా పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలు, కార్మికుల సంక్షేమానికి బీఆర్ఎస్ కట్టుబడి ఉందని చెప్పారు. అనంతరం జెడ్పీటీసీ పోశం నర్సింహారావు మాట్లాడగా నాయకులు అప్పారావు, సరెడ్డి రాఘవరెడ్డి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మిషన్ ఇంద్రధనుష్ ప్రోగ్రాం పరిశీలన

చంద్రుగొండ : స్థానిక పీహెచ్‌సీలో అమలు చేస్తున్న మిషన్ ఇంద్రధనుష్ కార్యక్రమ అమలు తీరును జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ బాలాజీ, డాక్టర్ మణికంఠ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యాధి నిరోధక టీకాలు, మిషన్ ఇంద్రధనుష్ కార్యక్రమ ఐఎంఐ సెషన్‌లను లబ్ధిదారులు ఉపయోగించుకోవాలని కోరారు. ఇక అయన్నపాలెంలో చేపట్టిన ర్యాపిడ్ ఫీవర్ సర్వే కార్యక్రమాన్ని జిల్లా మలేరియా అధికారిణి డాక్టర్ స్పందన పరిశీలించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో డాక్టర్ కనకం తనుజా, సీహెచ్‌ఓ నాగభూషణం, సిబ్బంది లక్ష్మి, అనిత, రజిని పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారులు

తపాలా సేవలు సద్వినియోగం చేసుకోవాలి

పోస్టల్ ఐపీఓ సుచేందర్

అశ్వాపురం: తపాలా శాఖ సేవలు సద్వినియోగం చేసుకోవాలని పోస్టల్ ఐపీఓ సుచేందర్ అన్నారు. మండల పరిధిలోని మొండికుంట బ్రాంచ్ పోస్టాఫీస్‌లో మంగళవారం పోస్టల్ డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహించగా ముఖ్య అతిథిగా హాజరైన సుచేందర్ మాట్లాడుతూ.. పోస్టల్ సేవలు, పొదుపు, బీమా సేవలను సద్వినియోగం చేసుకుంటే ఆర్థిక భరోసా కలుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం పోస్టల్ శాఖ ద్వారా ఇంటి వద్దకే సేవలు తీసుకొస్తోందన్నారు. సుకన్య సమృద్ధి యోజన, టైం డిపాజిట్, రికవరింగ్ డిపాజిట్, సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీం, పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్, కిసాన్ వికాస పత్రం తదితర సేవలు అందిస్తోందని వివరించారు. ప్రజల ఇంటి వద్దకే వెళ్లి ఆధార్ సేవలు అందించాలని నిర్ణయించామన్నారు. రూ.399 చెల్లిస్తే 10 లక్షల ప్రమాద బీమా అందుబాటులో ఉందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రతీ గ్రామ పంచాయతీలో పోస్టల్ కార్యాలయాలను ప్రారంభించిందని, ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పోస్టల్ కార్యాలయంలో బ్యాంకింగ్ సేవలు అందుబాటులో ఉన్నాయని, అకౌంట్ కావాలంటే తీసుకోవచ్చని చెప్పారు. సమావేశంలో అశ్వాపురం పోస్ట్‌మాస్టర్ సత్యభాస్కర్‌రెడ్డి, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ సమరశంఖం



ఉమ్మడి ఖమ్మం గుమ్మంలో ముఖ్యమంత్రి, గులాబీ బాస్ కేసీఆర్ ఎన్నికల సమరశంఖం పూరించబోతున్నారు. వరుస పర్యటనలతో ప్రచారాన్ని హోరెత్తించేలా ప్రణాళిక సిద్ధం చేశారు. ఈనెల 27న పాలేరు నియోజకవర్గంలో, వచ్చేనెల 1వ తేదీన సత్తుపల్లి, ఇల్లెందులో, ఆ తర్వాత 5వ తేదీన కొత్తగూడెం, ఖమ్మంలో నిర్వహించే సభలకు కేసీఆర్ హాజరవుతారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఉమ్మడి జిల్లాలో గత రెండు ఎన్నికల్లోనూ బీఆర్ఎస్‌కు ఒక్కో స్థానమే దక్కింది. గత పరిస్థితులను బేరీజు వేసుకుని ఈసారి మెజార్టీ స్థానాలు దక్కించుకోవడమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టి సారించారు. ఎన్నికల ప్రచారంపై మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సహా ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, నామ నాగేశ్వరరావు, బండి పార్థసారధిరెడ్డి, ఎమ్మెల్సీ తాతా మధుతోపాటు ఎమ్మెల్యేలు సమన్వయం చేసుకునేలా ఎప్పటికప్పుడు సూచనలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం

ఉమ్మడి జిల్లా సభల్లో పాల్గొననున్న గులాబీ బాస్

- ఈనెల 27న పాలేరు నుంచి మరూ
- వచ్చేనెల 1న సత్తుపల్లి, ఇల్లెందులో పర్యటన
- 5వ తేదీన కొత్తగూడెం, ఖమ్మంలో సభలు
- భారీగా జన సమీకరణతో నిర్వహించేందుకు బీఆర్ఎస్ ఏర్పాట్లు

పాలేరు నుంచి పాలికేక

ఉమ్మడి జిల్లాలో పాలేరు నియోజకవర్గం నుంచే గులాబీ బాస్ ప్రచార పాలికేకకు శ్రీకారం చుట్టనున్నారు. ఈనెల 27న మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రెండు గంటల వరకు పాలేరు నియోజకవర్గంలో నిర్వహించే సభకు సీఎం కేసీఆర్ హాజరవుతారు. అనంతరం వచ్చేనెల 1న సత్తుపల్లి నియోజకవర్గంలో మధ్యాహ్నం ఒకటి నుంచి రెండు గంటల వరకు, ఇల్లెందు నియోజకవర్గంలో రెండు నుంచి మూడు గంటల వరకు జరిగే సభల్లో సీఎం పాల్గొంటారు. నవంబర్ 5న కొత్తగూడెం, ఖమ్మంలో మధ్యాహ్నం జరిగే సభలకు కేసీఆర్ హాజరై ప్రసంగించనున్నారు. మొత్తంగా నవంబర్ మొదటి వారానికే ఐదు నియోజకవర్గాలను కేసీఆర్ చుట్టేయనుండగా, నవంబర్ రెండో వారంలో మిగతా చోట్ల సభలకు గులాబీ బాస్ హాజరవుతారు.

ప్రచారంలో దూకుడు

బీఆర్ఎస్ అభ్యర్థులను ప్రకటించి ఇప్పటికి యాభై రోజులు దాటింది. అభ్యర్థులు ఇప్పటికే రెండేసి సార్లు నియోజకవర్గాల్లో పర్యటించారు. మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్ కూడా ఖమ్మం, సత్తుపల్లి నియోజకవర్గాల్లో పర్యటించారు. ఖమ్మం, సత్తుపల్లిల్లో మంత్రి కేటీఆర్ కాంగ్రెస్‌పై ఘాటైన విమర్శలు చేయడమేకాక బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని, అభివృద్ధి చేసిన తమ ప్రభుత్వాన్ని మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడక ముందునుంచే బీఆర్ఎస్ ప్రచారంలో దూసుకెళ్తుండగా... ముఖ్యమంత్రి కేసీఆర్ సభలతో అభ్యర్థుల్లో నూతనోత్తేజం వస్తుందని నాయకత్వం భావిస్తోంది.

గతం పునరావృతం కాకుండా..

2014, 2018 ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పరాభవమే మిగిలిందని చెప్పాలి. రాష్ట్ర ఏర్పాటు తర్వాత తొలిసారి జరిగిన ఎన్నికల్లో కొత్తగూడెం, రెండో ఎన్నికల్లో ఖమ్మం స్థానమే దక్కింది. అయితే, రెండోసారి బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక మారిన రాజకీయ సమీకరణాలతో మధిర, భద్రాచలం మినహా కాంగ్రెస్, టీడీపీ ఎమ్మెల్యేలు గులాబీ గూటికి చేరారు. దీంతో ప్రజాప్రతినిధుల పరంగా బలం పుంజుకుంది. ఆ తర్వాత ఎమ్మెల్సీ పదవి తాతా మధుకు ఇవ్వడంతోపాటు రాజ్యసభకు వద్దిరాజు రవిచంద్ర, బండి పార్థసారధిరెడ్డిని పంపారు. దీంతో మిగిలిన జిల్లాలతో పోలిస్తే ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి చట్టసభల్లో పార్టీ ప్రాతినిధ్య బలం పెరిగింది. ఇలా అన్ని కోణాల్లో పార్టీ బలోపేతమైన నేపథ్యాన గత పరిస్థితులు పునరావృతం కాకుండా ఈసారి మెజార్టీ స్థానాలు దక్కించుకోవడమే లక్ష్యంగా ఆ పార్టీ నాయకత్వం పావులు కదుపుతోంది.

కేసీఆర్ మాటలే అస్త్రాలుగా..

ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ ఏడాది జనవరి 18న ఖమ్మంలో జరిగిన బీఆర్ఎస్ ఆవిర్భావ సభకు హాజరయ్యారు. కేసీఆర్‌తోపాటు పంజాబ్, ఢిల్లీ, కేరళ ముఖ్యమంత్రులు ఈ సభకు హాజరైన విషయం విదితమే. టీఆర్ఎస్ ఆవిర్భావం, బీఆర్ఎస్‌గా రూపాంతరం, తెలంగాణ ఉద్యమ నేపథ్యాన ఖమ్మం వేదికగా ఆయన చెప్పారు. గత రెండు ఎన్నికల్లో ఏర్పడిన లోటును పూడ్చుకునేందుకే బీఆర్ఎస్ ఆవిర్భావ సభను ఇక్కడ నిర్వహించినట్లు ప్రచారం జరిగింది. ఆ తర్వాత అకాల వర్షాలతో పంటలు దెబ్బతినగా బోనకల్ మండలంలో కేసీఆర్ పర్యటించి రైతులకు భరోసా కల్పించారు. ఇక ఉమ్మడి జిల్లాలో ఎన్నికల ప్రచార సభలకు వస్తున్న ఆయన ఇవ్వనున్న హామీలు, చేసే ప్రసంగం హాట్ టాపిక్ అవుతుందని భావిస్తున్నారు. కేసీఆర్ ప్రసంగమే పార్టీ అభ్యర్థుల గెలుపునకు మార్గం సుగమం చేయనుందనే విశ్లేషణ రాజకీయ వర్గాల్లో మొదలైంది.

క్లుప్తంగా

జెన్‌కో పోటీల విజేత కేటీపీఎస్


క్రీడాకారులను అభినందిస్తున్న సీఈ వెంకటేశ్వరరావు

పాల్వంచ: జోగుళాంబ గద్వాల జిల్లా జూరాలలో ఇటీవల జరిగిన టీఎస్ జెన్‌కో ఇంటర్ ప్రాజెక్ట్స్ క్యారమ్స్, చెస్ పోటీల్లో కేటీపీఎస్ 7వ దశ క్రీడాకారులు చాంపియన్ షిప్ ట్రోఫీలు అందుకున్నారు. మంగళవారం 7వ దశ సీఈ పి.వెంకటేశ్వరరావు పాల్వంచలో క్రీడాకారులు పి.రాజేశ్వరరెడ్డి, ఎండీ అక్బర్, కె.నరేశ్, ఎండీ సైదారావు, కె.వెంకటేశ్వర్లు, పి.వంశీ, బి.కృష్ణ, పి.సతీశ్‌ను అభినందించి మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలోనే కాక జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గేమ్స్ సెక్రటరీ వై.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆర్‌జేడీ తనిఖీ


అంగన్‌వాడీ కేంద్రంలో మొక్కలను పరిశీలిస్తున్న ఆర్‌జేడీ

పాల్వంచరూరల్: స్త్రీ, శిశు సంక్షేమ శాఖ రీజినల్ డైరెక్టర్ ఝాన్సీలక్ష్మీబాయి మంగళవారం పాల్వంచ మండలంతోపాటు పట్టణ పరిధిలో ఉన్న పలు అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. పోషణ్ వాటికలో భాగంగా జగన్నాథపురం, హమాలీకాలనీల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసిన ఆమె ఆయుర్వేద మొక్కలు, పండ్ల మొక్కలు నాటడంలో వేగం పెంచాలని సూచించారు. సీడీపీఓ కనకదుర్గ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, టీచర్లు పాల్గొన్నారు.

13న ఉమ్మడి జిల్లా స్థాయి ఎంపిక పోటీలు


కొత్తగూడెంటౌన్: ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఈ నెల 13న ఉమ్మడి జిల్లాస్థాయి వాలీబాల్, యోగా జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఖమ్మం, భద్రాద్రి జిల్లాల పాఠశాలల క్రీడా సంఘం కార్యదర్శులు కె.నర్సింహమూర్తి, స్టెల్లా తెలిపారు. అండర్–14 నుంచి అండర్–17 కేటగిరీల్లో జరిగే పోటీలకు ఉమ్మడి జిల్లాలోని 9, 10వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు స్టడీ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు జిరాక్స్, ఇంటర్ చదువుతున్న వారైతే 10వ తరగతి మెమో, కాలేజీ నుంచి తీసుకున్న స్టడీ సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు. పూర్తి వివరాలకు 80199 52592, 96527 17716 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించాల్సిందే..


ఇంటి ఎదుట వంట చేస్తున్న మహిళ

మణుగూరుటౌన్: డబుల్ బెడ్రూం ఇళ్లు కట్టించి నాలుగేళ్లు దాటినా నేటికీ కేటాయించలేదని, దీంతో అవి శిథిలావస్థకు చేరి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయని, వాటిని తమకు కేటాయించేదాకా కదలమని వాగుమల్లారం గ్రామస్తులు డిమాండ్ చేశారు. మంగళవారం వారు డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద బైఠాయించి మాట్లాడారు. నాలుగేళ్లలో మణుగూరు మండలంలో నలుగురు తహసీల్దార్లు మారారని, అందరికీ విన్నవించినా ఫలితం లేకపోయిందని, ప్రస్తుతం ఎన్నికల నియమావళి రావడంతో ఏమీ చేయలేమని చెబుతున్నారని వాపోయారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది వచ్చి వారిని అక్కడి నుంచి పంపే ప్రయత్నం చేయగా, వాగ్వాదం చోటుచేసుకుంది. కేసులు పెట్టినా ఇక్కడి నుంచి వెళ్లబోమని భీష్మించారు.

అక్రమంగా తరలిస్తున్న దుంగలు స్వాధీనం


లారీ నుంచి బయటపడిన తునికి దుంగలు

దుమ్ముగూడెం: మండలం మీదుగా ఇసుక లారీలో అక్రమంగా రవాణా చేస్తున్న 215 తునికి దుంగలను దుమ్ముగూడెం రేంజ్ డీఆర్వో శోభన్‌నాయక్, బీట్ ఆఫీసర్ రాజేశ్ మంగళవారం తెల్లవారుజామున పట్టుకున్నారు. మండలంలోని సరిహద్దు గ్రామమైన మారాయిగూడెం మీదుగా రవాణా చేస్తున్న లారీని రాత్రి పెట్రోలింగ్‌లో ఉన్న వారు గుర్తించి తనిఖీ చేయగా అందులో అడుగు, రెండు అడుగుల సైజ్‌లో కట్‌చేసి ఉన్న తునికి దుంగలు కనిపించాయి. లారీని అదుపులోకి తీసుకుని భద్రాచలం అటవీశాఖ కార్యాలయానికి తరలించారు. సుమారు 215 దుంగలు బయటపడ్డాయని, వాటి విలువ రూ.3,13,435 అని అటవీశాఖ అధికారులు వెల్లడించారు.

మిరపకు తెగులు.. రైతుకు దిగులు

పంటను ఆశించిన వేరుకుళ్లు, గుబ్బ తెగులు

- దిగుబడిపై ప్రభావం పడుతోందని ఆందోళన
- ఈ ఏడాది నష్టాలు తప్పవని రైతుల ఆవేదన
- జిల్లాలో 23 వేల ఎకరాల్లో మిర్చి సాగు



పాల్వంచ మండలం కోడిపుంజులవాగులో తెగులు సోకిన మిర్చితోట,(ఇన్‌సెట్) ఎండిపోతున్న మిర్చి మొక్కలు

పాల్వంచరూరల్: ఇప్పుడిప్పుడే పూత, కాతకు వస్తున్న మిర్చిపంటకు తెగుళ్లు సోకడంతో రైతులు దిగులు చెందుతున్నారు. మిర్చి పంటకు గతేడాది మార్కెట్‌లో మంచి ధర పలకడంతో రైతులు ఈ ఏడాది అధిక శాతం ఈ పంటనే సాగు చేశారు. జిల్లాలో ఈ ఏడాది 23వేల ఎకరాలకు పైగా మిర్చి సాగు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. మిర్చి పంటను సాగుచేసి మూడు నెలల కావస్తోంది. ఇప్పుడిప్పుడే పంట పూతకు వస్తున్న తరుణంలో మాయదారి తెగుళ్లు పంటను నాశనం చేస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోడిపుంజులవాగు, రెడ్డిగూడెం, పాండురంగాపురం, జగన్నాధపురం తదితర గ్రామాల్లో మిర్చిపంటకు వేరుకుళ్ల తెగులు ఆశించి మొక్క ఎండిపోతోంది. గుబ్బతెగులు వ్యాధి, ఆకుముడతతో కాయలు చిన్నగా ఉంటున్నాయని, పూత పూయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్ని రకాల మందులను పిచికారీ చేసినా మందు వాసన తప్ప వ్యాధి నయం కావడం లేదని రైతులు వాపోతున్నారు.

తెగుళ్ల లక్షణాలు

వేరుకుళ్ల వ్యాధి సోకిన మిర్చిపంటకు పచ్చగా కనిపించిన చెట్టు తెల్లవారేసరికి వాడిపోయి తర్వాత ఎండిపోతుంది. ఇలా ఒకచెట్టుతో మొదలై ఒక్కో చెట్టుకు వ్యాపించి పంటమొత్తానికి విస్తరిస్తుంది. ఇక ఆకుముడత గుబ్బ వ్యాధి సోకిన మిర్చిచెట్టు ఆకులు ముడుచుకుని ఎదగకుండా ఉండిపోవడం పూత, కాతలేకుండా ఉంటుంది. కాగా, తెగుళ్ల బెడదతో ఇప్పటికే జిల్లాలోని సుజాతనగర్, జూలూరుపాడు మండలాల్లోని పలువురు రైతులు పంట పూర్తిగా తొలగించారు.

వ్యాధి నివారణ చర్యలు



వేరుకుళ్లు వ్యాధి సోకిన వెంటనే రైతులు వ్యాధికి గురైన మొక్కను వేళ్లతోసహా తొలగించి దూరంగా వేయాలి, అలాగే ఉంచితే మిగిలిన మొక్కలకు సంక్రమించి పంట మొత్తానికి వ్యాపించి నష్టపరుస్తుంది. ఆకుముడత గుబ్బతెగులు వ్యాధికి రసం పీల్చే పురుమందులకు వినియోగించే మందులు వేస్తే వ్యాధి నయమవుతుంది.

– శంకర్, వ్యవసాయ శాఖాధికారి, పాల్వంచ

ఎన్ని మందులు వాడినా అంతే...



నేను మూడు ఎకరాల విస్తీర్ణంలో మిర్చిపంట సాగుచేశాను. ఇప్పటికే రూ.లక్షన్నరకుపైగా పెట్టుబడి పెట్టాను. పూతకు వస్తున్న సమయంలో పంటకు గుబ్బ, వేరుకుళ్లు వ్యాధులు సోకాయి. వీటి నివారణకు ఎన్ని మందులు వాడినా ఫలితం కనిపించడం లేదు. రోజురోజుకూ వ్యాధి విస్తరిస్తుంది. ఏం చేయాలో తెలియడం లేదు.

– అజ్మీర లక్కా, కోడిపుంజుల వాగు

అప్పుల పాలవుతున్నాం



గతేడాది పత్తి పంటను సాగు చేస్తే పెట్టుబడి కూడా రాలేదు. మిర్చికి మంచి డిమాండ్ ఉందని ఈ సారి ఎకరం న్నర విస్తీర్ణంలో ఈ పంట సాగు చేసి ఇప్పటికే రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టాను. మిర్చిపంటకు సోకిన తెగులుకు అనేక రకాల మందులను వినియోగించినా రోగం నయం కావడం లేదు. ఫెర్టిలైజర్ షాపుల్లో అప్పులు పెరిగి అప్పుల భారంగా మారింది. – జాటోతు రవి, కోడిపుంజుల వాగు

అధికారులు సూచనలు ఇవ్వాలి



ఎకరంన్నర భూమి కౌలుకు తీసుకుని మిర్చి పంట సాగుచేశాను. పంటకు సోకుతున్న వ్యాధుల కారణంగా ఈసారి దిగుబడి తగ్గి పెట్టిన పెట్టుబడులు కూడా రాని పరిస్థితి కనిపిస్తోంది. పంటలకు సోకుతున్న రోగాలను గుర్తించి వాటి నివారణకు సంబంధించి అధికారులు రైతులకు సలహాలు, సూచనలు అందించాలి.

– బానోతు హేమ్లా, రైతు

ఎమ్మెల్యేపై బీఆర్‌ఎస్ నేతల అసంతృప్తి

- ‘పేట’లో దళితబంధు, గృహలక్ష్మి కేటాయింపుల్లో బేరసారాలపై అలక
- జాబితా తారుమారుపై వ్యతిరేకత
- నాయకుల కినుక.. ఎమ్మెల్యే బుజ్జగింపు

అశ్వారావుపేట: స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావుపై మండల బీఆర్‌ఎస్ నాయకులు తీవ్ర అసంతృప్తిగా ఉన్నారు. సోమవారం రాత్రి అశ్వారావుపేటకు చెందిన సీనియర్ నాయకులు కోటగిరి సీతారామస్వామిని మండలంలోని ముఖ్య కార్యకర్తలు కలిసి తమ గోడు వినిపించారు. వాస్తవానికి 10 రోజుల క్రితమే దళితబంధు, గృహలక్ష్మి లబ్ధిదారుల జాబితా తనకు ఇవ్వాలని ఎమ్మెల్యే ఓ నాయకుడికి చెప్పగా.. నాయకులంతా ఏకాభిప్రాయంతో పార్టీలో కష్టపడే కార్యకర్తల జాబితాను సిద్ధం చేశారు. దీనికి భిన్నంగా మందపాటి మోహన్‌రెడ్డి ప్రత్యేక జాబితా సిద్ధం చేసి ఎమ్మెల్యేకు అందిస్తున్నారనే వార్తలు రావడంతో అంతా అవాక్కయ్యారు. ముఖ్య నాయకులంతా సీతారామస్వామిని కలిసి జరుగబోయే నష్టాన్ని ఎమ్మెల్యేకు వివరించాలని కోరారు. దీంతో సోమవారం రాత్రి ఎమ్మెల్యేను కలిసి అసంతృప్తి విషయం తెలిపేందుకు ఆయన దమ్మపేట మండలం తాటిసుబ్బన్నగూడెంలోని ఎమ్మెల్యే నివాసానికి వెళ్లారు. ఆ సమయంలో మోహన్‌రెడ్డితోపాటు మరో ముగ్గురు అక్కడే ఉన్నారు. వారిని ఆరా తీయగా అర్హుల జాబితా సమర్పించేందుకు వచ్చామని మోహన్‌రెడ్డి చెప్పడంతో.. అంతా కలిసి గతంలో జాబితా ఇచ్చాం కదా.. మళ్లీ మార్పేంటి.. అదీ ఎవరికీ తెలియకుండా ఇస్తే ఎలా అని ఎమ్మెల్యే ఎదుటే ప్రశ్నించారు.

తెల్లారే నిరసన..

ప్రభుత్వ పథకాలను అమ్ముకుంటే నష్టపోతారని కొందరు ఎమ్మెల్యేకు నేరుగా చెప్పినట్లు సమాచారం. దానికి మెచ్చా ఎటూ స్పందించకపోవడంతో వారు వెనుదిరిగారు. కాగా మంగళవారం అశ్వారావుపేట మండలం మామిళ్లవారిగూడెంలో జరిగిన పార్టీలో చేరికల కార్యక్రమానికి ముఖ్య నాయకులు, వారి అనుచరులు ఎవరూ రాలేదు. దీంతో పరువు పోతుందని, మీరు చెప్పినట్లు అన్నీ సరిచేస్తానని ఎమ్మెల్యే స్వయంగా బతిమాలితే కొందరు నాయకులు హాజరైనట్లు తెలిసింది.

ఆరోపణలు కొత్తేమీ కాదు..

దళిత బంధు పథకం మొదటి జాబితాలో లబ్ధిదారుకు రూ.4 లక్షలు, మధ్యవర్తికి రూ.2 లక్షలు, ఓ ప్రజా ప్రతినిధికి రూ. 4లక్షల చొప్పున అమ్మేసుకున్నారనే ఆరోపణలు భారీగా వచ్చాయి. ఓ దళితుడి భార్య అయిన గిరిజన మహిళకు దళితబంధు మంజూరయి.. ఆమె నుంచి నగదు వసూలు చేసి పంచుకున్నారంటే అవినీతి ఏ స్థాయిలో జరిగిందో అప్పట్లోనే బహిర్గతమైంది. తాజాగా దళితబంధు, గృహలక్ష్మి పథకాల పంపిణీలోనూ భారీ దోపిడీకి కొందరు పథకం సిద్ధం చేశారని.. ఇలాగే ఈ పరంపర కొనసాగితే బీఆర్‌ఎస్ పేరు చెప్పుకుని గ్రామాల్లో తిరగలేమని నాయకులు వాపోతున్నారు. ఇంతకీ ఎమ్మెల్యేకు తెలియకుండానే ఇదంతా జరుగుతోందా అనే అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నికలు సమీపిస్తున్న వేళ మరేం చేస్తారో చూడాలని అంటున్నారు.

జోనల్ క్రీడలకు గుండాల గురుకులం సిద్ధం

- 13 నుంచి 15 వరకు క్రీడా పోటీలు
- కలెక్టర్, ఐటీడీఏ పీఓకు ఆహ్వానం


ఆహ్వాన పత్రికతో కలెక్టర్, పీఓ తదితరులు

గుండాల: గిరిజన గురుకుల 7వ జోనల్ లెవెల్ గేమ్స్, స్పోర్ట్స్ మీట్–2023–24 నిర్వహణకు గుండాల గిరిజన గురుకుల విద్యాలయం సిద్ధమవుతోంది. బాలురకు నిర్వహించే ఈ క్రీడా పోటీలు ఈ నెల 13న ప్రారంభమై 15న ముగుస్తాయి. ఉమ్మడి ఖమ్మం, నల్లగొండ జిల్లాల నుంచి సుమారు 700 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొననున్నారు. వారికి భోజనం, వసతి సౌకర్యం కల్పించనున్నారు. భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ప్రతీక్‌జైన్ ఆదేశాలతో జోనల్ క్రీడలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు భద్రాచలం ఐటీడీఏ ఏపీఓ జనరల్, గిరిజన గురుకుల ప్రాంతీయ సమన్వయ అధికారి హెచ్.డేవిడ్‌రాజ్ వెల్లడించారు. ఖమ్మం, నల్లగొండ జిల్లాల నుంచి గిరిజన గురుకులాల (18 పాఠశాలలు/కళాశాలలు) నుంచి బాలురు పలు అంశాల్లో పోటీల్లో పాల్గొంటారని ఆయన చెప్పారు. కాగా, డేవిడ్‌రాజ్ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్ ప్రియాంక ఆల, భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్‌కు క్రీడలకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను అందజేశారు. కార్యక్రమంలో గుండాల గిరిజన గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ గుగులోతు హరికృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ విప్పా సత్యనారాయణ, అర్థశాస్త్ర అధ్యాపకుడు రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

పదేళ్లుగా ప్రజలను మోసం చేశారు..

భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీరయ్య

భద్రాచలంటౌన్: రాష్ట్రంలో ఎన్నికల ముందు అమలుకాని హామీలు ఇచ్చి బీఆర్‌ఎస్ నాయకులు పదేళ్లుగా మోసం చేస్తున్నారని డీసీసీ అధ్యక్షుడు, భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దళితబంధు రాష్ట్రంలో మొత్తం అమలైన తరువాతనే ఓట్లు అడుగుతామని చెప్పిన కేసీఆర్ మరోసారి గారడీ మాటలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నాడని ఆరోపించారు. కేటీఆర్ గత ఎన్నికల ముందు అధికారంలోకి వస్తే గృహలక్ష్మి పథకాన్ని అమలుచేసి, ప్రతి పేదవాడికి వారి స్థలంలోనే ఇల్లు కట్టుకునే విధంగా ఆర్థిక సాయం చేస్తామని విస్మరించారని విమర్శించారు. నవంబర్‌లో జరిగే ఎన్నికల్లో ప్రజలు ఓటుతో బీఆర్‌ఎస్ పార్టీని భూస్థాపితం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో మండల అధ్యక్షుడు సరెళ్ల నరేశ్, బుడగం శ్రీనివాస్, నల్లపు దుర్గాప్రసాద్, రవికుమార్, లంకా శ్రీనివాసరావు, శ్రీనివాస్‌గౌడ్, తిరుపతయ్య, చలపతి తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టుల శిబిరాన్ని ధ్వంసం చేసిన బలగాలు

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుకుమా జిల్లా పరిధిలో గల కింద్రెల్‌పాడు, నాగారంలోని అటవీప్రాంతంలో మావోయిస్టులు ఏర్పాటు చేసుకున్న శిబిరాలను భద్రత బలగాలు మంగళవారం ధ్వంసంచేసాయి. త్వరలో రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో డీఆర్జీ బస్తర్ ఫైటర్స్, డిస్ట్రిక్ ఫోర్స్, 202 కోబ్రా బెటాలియన్ భద్రత బలగాలు గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ క్రమంలో కింద్రెల్‌పాడు, నాగారంలోని అటవీప్రాంతంలో మావోయిస్టులు ఏర్పాటు చేసుకున్న శిబిరాలను గుర్తించిన సైనికులు కూల్చివేశారు. దట్టమైన అడవుల్లో నక్సలైట్లు మకాం వేసి ఎన్నికల సమయంలో విధ్వంసాలు సృష్టించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, దీంతో ముందస్తు చర్యలు చేపట్టామని సుకుమా ఎస్పీ కిరణ్‌చవాన్ తెలిపారు.

నేడు కొత్తగూడేనికి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్


మాట్లాడుతున్న ఎర్రా కామేశ్

కొత్తగూడెంఅర్బన్: రాష్ట్రంలో అగ్రవర్ణ ఆధిపత్యంతో ఉన్న బీఆర్‌ఎస్ పాలనను కూకటివేళ్లతో సహా పెకిలించేందుకు నడుంబిగించిన బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ బుధవారం కొత్తగూడెం రానున్నరని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రా కామేశ్ తెలిపారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ కొత్తగూడెం చేరుకున్నాక కార్యకర్తలతో ర్యాలీగా సూపర్‌బజార్ నుంచి బస్టాండ్‌కు చేరుకొని అమరవీరుల స్తూపానికి నివాళులర్పిస్తారని, అనంతరం కొత్తగూడెం క్లబ్‌లో జరిగే బహిరంగ సభలో మాట్లాడుతారని, పార్టీ కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో గంధం మల్లికార్జున్‌రావు, సాయి, గుడివాడ రాజేందర్, అల్లకొండ శరత్ తదితరులు పాల్గొన్నారు.

తనిఖీల్లో నగదు స్వాధీనం

జిల్లాలో మూడు చోట్ల పట్టుబడిన నగదు


కొత్తగూడెంటౌన్: నగదు స్వాధీనం చేసుకుంటున్న సీఐ కరుణాకర్

భద్రాచలంఅర్బన్: ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యాన భద్రాచలం పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో చెక్‌పోస్టులను ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా మంగళవారం భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్ ఆధ్వర్యాన చెక్‌పోస్టుల వద్ద పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగా నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారి తీకొస్తున్న రూ.1.74 లక్షలను ట్రాఫిక్ ఎస్‌ఐ శ్రీనివాస్, ఇంకో వ్యాపారి నుంచి రూ.లక్షను టౌన్ ఎస్‌ఐ మధుప్రసాద్ స్వాధీనం చేసుకున్నారు. అయితే, వ్యాపారులు తగిన ఆధారాలు సమర్పించకపోవడంతో సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. కాగా, తనిఖీల సందర్భంగా రెండు వాహనాలకు పోలీసు స్టిక్కర్లు ఉండడం, అందులోని వ్యక్తులకు పోలీసు శాఖతో సంబంధం లేదని గుర్తించిన ఏఎస్పీ పరితోష్ పంకజ్ మందలించారు.

కొత్తగూడెంలో..

కొత్తగూడెంటౌన్: ఎలాంటి ధ్రువపత్రాలు లేకుండా కారులో తరలిస్తున్న రూ.1.20 లక్షల నగదును కొత్తగూడెం వన్‌టౌన్ పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. కొత్తగూడెం వన్‌టౌన్ సీఐ కరుణాకర్ ఆధ్వర్యాన పోస్టాఫీస్ సెంటర్‌లో చేపట్టిన తనిఖీల్లో ఈ నగదు లభించగా సీజ్ చేశారు. ఎస్‌ఐలు బి.శ్రీనివాస్, జి.విజయ, సిబ్బంది ఘనీ, వీరన్న, శంకర్‌చారి, సంపత్ పాల్గొన్నారు.

అశ్వారావుపేటలో..

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేట సమీపంలోని నందమూరినగర్ వద్ద తెలంగాణ – ఏపీ సరిహద్దులో సీఐ కరుణాకర్, ఎస్‌ఐ పి.శ్రీకాంత్ ఆధ్వర్యాన వాహనాలు తనిఖీ చేశారు. ఈ మేరకు ఇద్దరి నుంచి ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.4,61,100 నగదును స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నాటుసారా పట్టివేత

టేకులపల్లి: అక్రమంగా నాటుసారా తయారు చేసి విక్రయిస్తున్న వ్యక్తిని టేకులపల్లి సీఐ ఇంద్రసేనారెడ్డి, బోడు ఎస్‌ఐ రంజిత్ పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు కొప్పురాయి పంచాయతీ పరిధిలో నాటుసారా తయారు చేసి విక్రయిస్తున్నట్లు తెలియడంతో సీఐ, ఎస్‌ఐ, పోలీసు సిబ్బంది మంగళవారం రాత్రి ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. రాజారాంతండాకు చెందిన బానోత్ మంగ్య 20 లీటర్ల నాటుసారా తరలిస్తూ పట్టుబడ్డాడు. నాటుసారాను స్వాధీనం చేసుకుని, మంగ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నాలుగు టన్నుల ఐరన్ చానళ్లు రికవరీ

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పీవీకే–5 షాఫ్టుకు సంబంధించిన సుమారు 4 టన్నుల ఐరన్ చానళ్లను మంగళవారం కార్పొరేట్ ఏరియా చీఫ్ సెక్యూరిటీ జీఎం బీఆర్ దీక్షితులు ఆధ్వర్యంలో రికవరీ చేసినట్లు కార్పొరేట్ ఏరియా సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ జాకీర్ హుస్సేన్ తెలిపారు. తిప్పనపల్లిలోని ఒక రైస్ మిల్లులో సింగరేణికి చెందిన చానళ్లు ఉన్నట్లు వచ్చిన పక్కా సమాచారం మేరకు దాడి చేసి, వాటిని స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. సింగరేణి విజిలెన్స్ విభాగం అధికారులు పూర్తి విచారణ చేపడుతారని, ఐరన్ చానళ్ల విలువ రూ.2.50 లక్షలు ఉంటుందని ఆయన వివరించారు. శశిధర్‌రాజు, వేణుమాధవ్, రమణ తదితరులు పాల్గొన్నారు.

రూ.లక్ష విలువైన గంజాయి స్వాధీనం

రఘునాథపాలెం: మండల కేంద్రమైన రఘునాథపాలెంలోని యాపిల్ సెంటర్‌లో మంగళవారం చేపట్టిన తనిఖీల్లో రూ.లక్ష విలువైన నాలుగు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శ్రీధర్ తెలిపారు. ఎస్‌ఐ కొండల్‌రావు ఆధ్వర్యాన వాహనాలు తనిఖీ చేస్తుండగా, ఆటోను ఆపడంతో అందులో ఉన్న వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించాడు. దీంతో ఆయన బ్యాగ్‌ను తనిఖీ చేయగా గంజాయి లభించింది. సదరు వ్యక్తి భద్రాది జిల్లా బూర్గంపాడు మండలం మోత్‌పట్టునగర్‌కు చెందిన టి.కిరణ్‌కుమార్ కాగా, ఒడిశాలో గంజాయి కొనుగోలు చేసి ఖమ్మంలో ఎక్కువ ధరకు అమ్మేందుకు వస్తున్నట్లు నిర్ధారించారు.

భద్రాచలం బస్టాండ్ వద్ద 10 కిలోలు..


మహమ్మద్ నర్షిద్

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలో ఆర్టీసీ బస్టాండ్ వద్ద అక్రమంగా తరలిస్తున్న 10 కిలోల గంజాయిని టౌన్ ఎస్‌ఐ విజయలక్ష్మి పట్టుకున్నారు. మంగళవారం పట్టణంలో పోలీసులు వాహనాల తనిఖీ చేస్తున్న క్రమంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని అదుపులోని తీసుకుని విచారించగా కేరళ రాష్ట్రానికి చెందిన మహమ్మద్ నర్షిద్‌గా తేలిందని, జగదల్పూర్‌లో గంజాయిని కొనుగోలు చేసి కేరళలో అమ్మడానికి తీసుకుని వెళ్తుండగా భద్రాచలం పట్టణంలో పట్టుబడినట్లు పోలీసులు తెలిపారు. కాగా, పట్టుబడిన గంజాయి విలువ రూ.2.50 లక్షలు ఉంటుందని, వ్యక్తిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

గంజాయి రవాణా కేసులో ముగ్గురికి పదేళ్ల జైలు

కొత్తగూడెంటౌన్: అక్రమంగా గంజాయి రవాణా చేస్తూ పట్టుబడిన కేసులో హైదరాబాద్, నల్లగొండ జిల్లాలకు చెందిన ముగ్గురు వ్యక్తులకు 10 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.లక్ష జరిమానా విధిస్తూ మంగళవారం జిల్లా మొదటి అదనపు సెషన్స్ జడ్జి (స్పెషల్ జడ్జి ఎన్‌డీపీఎస్ యాక్ట్) శ్యాంశ్రీ తీర్పు చెప్పారు. వివరాలిలా ఉన్నాయి.. 2019, అక్టోబర్ 10న భద్రాచలం పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా కారులో 62.2 కేజీల గంజాయి తరలిస్తూ నలుగురు వ్యక్తులు పట్టుబడ్డారు. వారు హైదరాబాద్, నల్లగొండ జిల్లాలకు చెందిన మాలోత్ వినోద్, సపరిత్ అనిల్, బానోతు శివ, బానోతు శంకర్‌గా పోలీసులు గుర్తించారు. భద్రాచలం టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఐదుగురు సాక్షులను విచారించగా బానోత్ శంకర్ మినహా మిగతా ముగ్గురు నేరం చేశారని రుజువు కావడంతో ఒక్కొక్కరికీ పదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.లక్ష జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు. నల్లగొండ జిల్లాకు బానోతు శంకర్‌పై కేసు కొట్టివేశారు. అదనపు పీపీ రావి విజయ్‌కుమార్ వాదించగా.. లైజన్ ఆఫీసర్ హరిగోపాల్, భద్రాచలం డ్యూటీ ఏఎస్‌ఐ గంజి శశిధర్ సహకరించారు.

ఫేక్ మెసేజ్‌తో పోలీసుల హైరానా

- గోదావరిలో ఇద్దరు దూకారని భావించి హుటాహుటిన గాలింపు చర్యలు
- గంట తర్వాత వెలుగుచూసిన అసలు విషయం


బ్రిడ్జి పైన పరిశీలిస్తున్న ఏఎస్పీ పరితోష్ పంకజ్

భద్రాచలంఅర్బన్: సామాజిక మాధ్యమాల్లో అందిన తప్పుడు సమాచారంతో మంగళవారం ఉదయం పోలీసులు గంటపాటు తీవ్ర ఆందోళన చెందారు. ఉదయం 10 గంటలకు గోదావరి వంతెన పైనుంచి ఇద్దరు వ్యక్తులు కిందకు దూకారని పోలీసులకు సమాచారం అందింది. దీంతో హుటాహుటిన ఏఎస్పీ పారితోష్ పంకజ్, సీఐ నాగరాజురెడ్డి, ఎస్‌ఐ మధుప్రసాద్, ట్రాఫిక్ సివిల్ పోలీస్ సిబ్బంది, ఎన్డీఆర్‌ఎఫ్ బృందం, అగ్నిమాపక సిబ్బంది బ్రిడ్జి వద్దకు చేరుకున్నారు. అదే సమయంలో బ్రిడ్జి పైన ద్విచక్రవాహనంతో పాటు బ్యాగు, వాటర్ బాటిల్, చెప్పులు ఉండటంతో దానిపై వచ్చినవారే గోదావరిలో దూకారని భావించి గోదావరిలో గంటపాటు గాలింపు చర్యలు చేపట్టారు. ఇంతలోనే ద్విచక్ర వాహనానికి సంబంధించిన వ్యక్తి అక్కడకు వచ్చి గోదావరిలో ఎవరూ దూకలేదని, ద్విచక్రవాహనం తనదేనని చెప్పడంతో వారు ఊపిరిపీల్చుకున్నారు.

అసలు విషయం ఇదీ..

సారపాక వైపు నుంచి ఓ వ్యక్తి తన కుమార్తెతో కలిసి ద్విచక్రవాహనంపై బ్రిడ్జిపైకి రాగానే ఆమెకు ఫిట్స్ వచ్చాయి. ఏంచేయాలో తోచక సదరు వ్యక్తి ద్విచక్ర వాహనంతోపాటు ఇతర వస్తువులను అక్కడే వదిలేసి ఆమెను ఆటోలో ఆస్పత్రికి తీసుకెళ్లాడు. బ్రిడ్జిపై తిరుగుతున్న ప్రయాణికులు అక్కడి దృశ్యాన్ని చూసి ఎవరో గోదావరిలో దూకారని వైరల్ చేశారు. వాహన యజమాని రావడంతో కథ సుఖాంతమైంది.

వాగులో దూకి మహిళ ఆత్మహత్య

కొత్తగూడెంరూరల్: మండలంలోని సంజయ్‌నగర్‌కు చెందిన ఓ మహిళ స్థానిక మొర్రేడువాగులో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన ఎస్.స్వప్న (52) కొంతకాలంగా మానసిక్థితి సరిగా లేక ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. మంగళవారం ఉదయం ఆమె ఇంటి నుంచి బయటకు వచ్చి మొర్రేడువాగులో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలికి భర్త సుబ్బారావు, కుమార్తె ఉన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

■ మావద్ద 10thతో మధ్యమ, సాహిత్యరత్న, హిందీ పరీక్షలు, ఓపెన్ 10th, ఇంటర్, డిగ్రీ, పి.జీ. B.Sc. నర్సింగ్, B.Tech., B.Ed., B.Ped., అడ్మిషన్ల కొరకు సంప్ర. ఖమ్మం–99481 31154 [M-1221768]

Real Estate

LAND FOR SALE

■ ఖమ్మం – సూర్యాపేట హైవేకి 2వ బిట్టు నాయకన్‌గూడెం చెర్వు కింద 5 ఎకరాల వ్యవసాయ భూమి అమ్మకానికి కలదు. హైవే నుండి దారి కలదు. సంప్ర।। 9848773929, 9951652755 [Y-784384]

Services

BUSINESS

■ ద్వారకా ఎంటర్‌ప్రైజెస్: పేపర్ ప్లేట్స్ & LED మెషిన్స్‌పై ప్రతి నెల అధిక ఆదాయం, అద్భుత అవకాశం, ఉచిత ముడి పదార్థాలు, 100% తిరిగి కొనుగోలు ఒప్పందం. Ph: 9310515624, 8800496710 [HA-41395]

Wanted

■ మా బార్ & రెస్టారెంట్ నందు పని చేయుటకు సప్లయిర్స్ మరియు క్లీనర్స్ కావలెను. అనిల్ బార్ & రెస్టారెంట్, పాత మునిసిపల్ ఆఫీస్ దగ్గర, స్టేషన్ రోడ్, ఖమ్మం. [M-1221770]

■ HI REACH BROAD BAND నందు పని చేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. అడ్రస్ : JL టవర్స్, వైరా రోడ్, ఖమ్మం. సంప్ర. : 96422 25357, 96422 25493. [M-1221277]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం జీతం: 18K. Ph: 9640400073/9848571888 [H-189342]

■ కేర్ టేకర్స్, ఆయాలు, నర్సులు (MF) కావలెను. ప్రముఖుల ఇళ్ల వద్దనే ఉండి వృద్ధులను, బెడ్ పేషెంట్లను చూసుకొనుటకు Sal. 14-20K, వసతి+భోజనం, విజయవాడ. ✆ 91608 35559, 78158 35561 [B-450]

■ రామకృష్ణ గ్రూపు, (AP No.1) VJA, HYD శ్రీమంతులఇళ్ళలో వృద్ధుల సేవకు, వంట/ఇంటిపని, బేబీకేర్ వర్కర్స్ కావలెను. జీ. 15-21 వేలు. ఏజెంట్లకు కమీషన్ 5 వేలు ✆ 8639756217, 8639756214 [B-1068146]

ప్రకటన గోరంత! స్పందన కొండంత!!
సాక్షి క్లాసిఫైడ్స్
ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు మా ప్రతినిధులను సంప్రదించండి
వివరాలకు :
ఖమ్మం : 9010299957
9705444182
కొత్తగూడెం : 9010223783
పాల్వంచ : 9705444183

సాక్షి ద్వారా మీ చిన్నారి పుట్టిన రోజు శుభాకాంక్షలను తెలియజేయండి
కేవలం రూ. 500/- మాత్రమే
(GST 5% అదనం)

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.